క్లుప్తంగా

ఫిజియోథెరపీ సేవలు



దివ్యాంగుల పునరావాస కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్) : జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం(డీటీఆర్‌సీ)లో ఉచిత ఫిజియోథెరపీ సేవలు అందజేస్తున్నట్లు సంస్థ కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్ – టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రంలో దివ్యాంగులకు ఫిజియోథెరపీని ఉచితంగా అందిస్తోందన్నారు. పక్షవాతం, మూతి వంకర, మెడ నొప్పి, నడుము నొప్పి, అన్ని రకాల కాలి నొప్పులకు ప్రత్యేక యంత్ర పరికరాల ద్వారా చికిత్స చేయబడుతుందని, కావున అవసరమైన వారు ఉపయోగించుకోవాలని సంస్థ కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి కోరారు. వివరాలకు 08812 –249297, 7386565469 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణ పూజల్లో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక దొండపాడు శ్రీ బాల అయ్యప్ప స్వామి క్షేత్రానికి దక్షిణ వైపు ఖాళీ స్థలంలో జరిపిన తవ్వకాల్లో లభ్యమైన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి విగ్రహానికి ఆలయ నిర్మాణం నిమిత్తం శనివారం శంకుస్థాపన పూజలు నిర్వహించారు. ఉదయం 10.54 గంటలకు వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆస్థాన పండితుడు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, క్రతువులు నిర్వహించారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు సాహిత్య పురస్కార సభ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక వైఎంహెచ్‌ఏ హాల్‌లో గుప్తా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీశ్రీ కృష్ణమూర్తి సాహిత్య పురస్కార సభ ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ మడుపల్లి మోహన గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు సాహిత్యానికి విశేష సేవలందించిన ఓల్గా (పోపూరి లలిత కుమారి)ని ఈ ఏడాది కృష్ణమూర్తి సాహిత్య పురస్కారానికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ సభలో ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు పాల్గొంటారని, ప్రత్యేక ఆహ్వానితులుగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పాల్గొంటారని తెలిపారు.

స్వచ్ఛ ఆంధ్ర.. అందరి బాధ్యత

ఏలూరు (టూటౌన్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని నగర కమిషనర్ ఏ.భానుప్రతాప్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక సుబ్బమ్మదేవి స్కూల్ గ్రౌండ్ దగ్గర బెండపూడి వారి వీధి నందు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ భాను ప్రతాప్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపవచ్చునన్నారు. ఈ సందర్భంగా స్థానికులచే ప్రతిజ్ఞ చేయించారు. ప్రజలకు తడి చెత్త, పొడి చెత్తను డస్ట్‌బిన్‌ల నందు ఎలా వేయాలో వివరించారు. డస్ట్‌బిన్‌లలోని చెత్తను కార్పొరేషన్ చెత్త వాహనాల్లోనే వేయాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక డ్వాక్రా మహిళలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ తదితరులు



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమం కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల ఆవరణ, తరగతి గదులు, కార్యాలయాన్ని శుభ్రం చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ పీఓ ఎం.విజయకుమార్ విద్యార్థులతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు జీజీహెచ్‌లో ప్రత్యేక వైద్యచికిత్స

వంకర పాదాల వ్యాధికి చికిత్స అందుబాటులో

ఏలూరు టౌన్: చిన్నారులకు పుట్టుకతో వచ్చే వంకర పాదాల వ్యాధికి ప్రత్యేక వైద్య చికిత్సను అందుబాటులోకి తెచ్చినట్లు ఏలూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంఎస్ రాజు తెలిపారు. ఖేల్ ఇండియా సంస్థ సౌజన్యంతో ఈ వ్యాధికి చికిత్స అందిస్తున్నామన్నారు. దెందులూరు మండలం మేధినరావుపాలెం గ్రామానికి చెందిన శ్రావణి, శాంతిరాజు దంపతులకు ఇటీవల చిన్నారి జన్మించింది. నాలుగు రోజుల చిన్నారి వంకర పాదాల వ్యాధితో బాధపడుతూ ఉండటంతో చిన్నారికి వైద్యచికిత్స అందించామని తెలిపారు. ప్రతి గురువారం 13వ నెంబరు ఓపీలో ఈ చికిత్స అందుబాటులో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. తొలుత తెల్ల సిమెంటు కట్టుతో వైద్యం అందిస్తామని, అయినా సరికాకపోతే ఆపరేషన్ ఉచితంగా చేసి పూర్తి స్థాయిలో చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వంశీ, వైద్య ధన్వశ్రీ తదితరులు పర్యవేక్షించారు. ఈ వైద్య సేవల్లో ఎముకల వైద్యనిపుణులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ నవ్య, మత్తు డాక్టర్లు, నర్సులు, ఎస్ఎంఓలు ఉన్నారు.



చిన్నారికి వైద్యం చేసిన డాక్టర్ల బృందం

చిన్నారులకు పుట్టుకతో వచ్చే వంకర పాదాల వ్యాధి

క్లస్టర్ సమావేశాల సమయాన్ని వ్యతిరేకిస్తున్నాం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయులకు అసౌకర్యంగా ఉన్న, ఆందోళనకు గురిచేసే క్లస్టర్ పాఠశాల సముదాయ సమావేశాల సమయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు జీజేపీ స్టీవెన్, ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటి వెంకటరమణ, తోట ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం వరకు పాఠశాలలో హాజరై మధ్యాహ్న భోజనం తర్వాత సమావేశాలకు హాజరుకావడం ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా ఉందన్నారు. సమావేశాలు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించాలని డిమాండ్ చేశారు. క్లస్టర్ సమావేశాల వలన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఉపయోగకరంగా ఉంటుంది కానీ క్లస్టర్ పరిధిలో ఇద్దరు ముగ్గురు మాత్రమే ఉండే ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల సబ్జెక్టు టీచర్లకు ఏవిధంగా ఉపయోగకరమో అధికారులు ఆలోచించాలన్నారు. మండలంలోని ప్రతి క్లస్టర్‌కు ఒక సబ్జెక్టు కేటాయించి మండలంలోని సబ్జెక్టు టీచర్లు అందరూ హాజరై చర్చించుకుంటే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మధ్యాహ్నం 1.30 తర్వాత ఫేషియల్ అటెండెన్స్ వేయకుండా లాక్ చేయడం సాయంత్రం 5 గంటలకు సమావేశం అయిపోతే 5.30 తర్వాతే ఫేషియల్ అటెండెన్స్ వేయాలనడం 5.30 తర్వాత కూడా అటెండెన్స్ వేసే వారికి సర్వర్ పనిచేయకపోవడం ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తోందన్నారు. ఇలాంటి చర్యలను వ్యతిరేకిస్తున్నామన్నారు.

ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి

ఏలూరు (టూటౌన్): లంబాడీల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి సందర్భంగా భోగ్ బండారో మహా యజ్ఞంను ఏలూరులోని గిరిజన లంబాడా భవన్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీ బంజారా సుగాలి లంబాడి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుగ్గులోతు కృష్ణ నాయక్ మాట్లాడుతూ సమస్త మానవాళి ధర్మ మార్గంలో నడవాలని, ప్రకృతిని, ధన్యజీవులను మహిళలను గౌరవిస్తూ జీవించాలని సేవాలాల్ హితబోధ చేశారని అన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు భూక్యా నాగేశ్వరావు నాయక్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న లంబాడీలను చెడు అలవాట్ల నుండి దూరం చేసి ఆధ్యాత్మిక మార్గంలో నడిపించడానికి కృషిచేసిన ఏకైక దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ అని అన్నారు. ఆయన జయంతిని ప్రతితండాల్లో అధికారికంగా నిర్వహించాలని, లంబాడి ఉద్యోగులకు ప్రత్యేక సెలవును మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నాయకులు బాణావతు ప్రభాకర్ రావు, భూక్య సామ్ములు, గుగ్గులోతు బాలు, ధారావతు నాగేశ్వరావు, బి ఝాన్సీ రాణి బాయ్ తదితరులు పాల్గొన్నారు.



సేవాలాల్ మహరాజ్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	14	చిక్కుడు కాయలు	28
వంకాయలు (కాంతులు)	24	బీన్స్ చిక్కుడు	36
వంకాయలు (తెలుపు)	18	చామదుంపలు	44
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	24	కంద	72
కాకర కాయలు	32	బీట్‌రూట్	32
బీరకాయలు (పందిరి)	46	కీరా దోస	44
కాలీఫ్లవర్	00	ఫ్రెంచ్‌బీన్స్	60-72
క్యాబేజీ	16	అల్లం	50
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	24	పాలకూర	10
బంగాళదుంపలు	28	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	32	గోంగూర	07-10
దోసకాయలు	24-38	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	04
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	12
ఏలూరు - బీహెచ్ఈఎల్ స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్	22.30	00
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	07
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	11
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	06
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	10
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	20
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	14
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	14
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	11
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

జాతర మహోత్సవాలు




కామవరంలో అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: కామవరంలో గ్రామ దేవతల జాతర మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. నాలుగోరోజు దుర్గమ్మతల్లి, గుబ్బల మంగమ్మతల్లి, నాగదుర్గాదేవి, గద్దెరాజులకు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని పుట్టింటి పాన్పుపై కూర్చోపెట్టి ఒడిబియ్యం, కొలత బియ్యాన్ని భక్తులు సమర్పించారు. అదేవిధంగా అమ్మవారి పాన్పుతో గ్రామంలోని ఇంటింటికీ తీసుకువెళ్లి పసుపు, కుంకుమలతో వడి, కొలత బియ్యం సమర్పించి పూజలు చేశారు. ఉదయం జరిగిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గిరిజనులతో సాంప్రదాయ నృత్యాలు చేశారు. ఆలయ పీఠాధిపతి వర్సా పుల్లారావు ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు సమర్పించారు.

కుటుంబ వ్యవస్థను గౌరవించండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రతి ఒక్కరికీ కుటుంబ వ్యవస్థపై గౌరవం ఉండాలని జమాతె ఇస్లామి హింద్ జాతీయ కార్యదర్శి మొహియుద్దీన్ ఘాజీ సూచించారు. జమాతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో స్థానిక తంగెళ్ళమూడి నెహర్ మసీదులో శనివారం ఫ్యామిలీ కౌన్సిలింగ్ వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మొహియుద్దీన్ మాట్లాడుతూ ఇటీవల ప్రతి ఒక్కరూ కుటుంబాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారని ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. ఒకరిని ఒకరు అర్థం చేసుకుంటూ కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాల్సి ఉందన్నారు. అలాగే వివాహమైన దంపతులు చిన్నచిన్న మనస్పర్థలకే విడాకుల వరకూ వెళుతున్నారని, అటువంటి వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా తమ సంస్థ కుటుంబాలు విచ్ఛిన్నం కాకుండా కాపాడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జమాతె ఇస్లామి హింద్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ కరీముద్దీన్, ఫ్యామిలీ కౌన్సిలింగ్ రాష్ట్ర కార్యదర్శి ఖాదా పర్వీన్, ఎంపీజే జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇస్మాయిల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శి మొహియుద్దీన్ ఘాజీ

భక్తిశ్రద్ధలతో సుందరకాండ పారాయణం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో జరుగుతున్న 93వ వార్షిక రామకోటి మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకూ విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత్య కల్యాణం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్థానిక అగ్రహారానికి చెందిన శ్రీ కనదుర్గ భజన మండలి ఆధ్వర్యంలో కొనకళ్ళ సంధ్యారాణి, శిష్యబృందం సుందరకాండ పారాయణం అత్యంత భక్తిశ్రద్ధలతో చేశారు. సాయంత్రం 5.30 గంటలకు నగరానికి చెందిన వేదాంతం విష్ణుప్రసాద్ మహాభారత వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి 7 గంటలకు నగరానికి చెందిన వంగల శ్రావణి బృందం కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. అర్చక స్వాములు దివాకరుని శ్రీ వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.



సుందరకాండ పారాయణం చేస్తున్న భక్తులు

మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

చింతలపూడి: మార్చి 8న స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు కోరారు. శనివారం కోర్టు ఆవరణలో పోలీసు, ఎక్సైజ్ అధికారులు, న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌లను వినియోగించుకోవాలని సూచించారు. క్రిమినల్, సివిల్ కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు, చెక్ బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరీ కేసులు, కుటుంబ తగాదా, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. కేసులు రాజీ చేసుకునే వారి కోసం ప్రతిరోజూ కోర్టులో ప్రీలోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నామన్నారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని చెప్పారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమాచారం కోసం దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లను, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పోలీస్ సీఐ రవీంద్రనాయక్, ఎక్సైజ్ సీఐ పి అశోక్, టి నరసాపురం, ధర్మాజిగూడెం, తడికలపూడి ఎస్సైలు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌పై పోలీసు అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

చింతలపూడి సబ్‌జైల్‌ను జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు శనివారం సందర్శించారు. సబ్ జైల్‌లో ముద్దాయిలకు అందిస్తున్న ఆహారం, వసతి సదుపాయాలపై జైలు అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఖైదీలకు చట్టాలపై అవగాహన కలిగించారు. క్షణికావేశాల్లో నేరాలకు పాల్పడి శిక్ష అనుభవించాక సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతిఒక్కరూ హింసా మార్గాన్ని విడనాడాలని పిలుపునిచ్చారు. ఆర్థిక స్తోమత లేక న్యాయవాదిని పెట్టుకోలేని వారి కోసం లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంతకు ముందు వంటశాలను, స్టోర్ రూంను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ కృపానందం, జైలు సిబ్బంది, ప్యానల్ లాయర్ కే అప్పయ్య, పీఎల్‌వీపీ కుమార్, కోర్టు సూపరింటెండెంట్ బి సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బంజారా రైతులకు కిసాన్ అవార్డులు

టి.నరసాపురం: కృష్ణాపురం గ్రామంలోని శ్రీ సేవాలాల్ దేవాలయం నందు బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 15 మంది బంజారా రైతులకు శ్రీ సేవాలాల్ కిసాన్ అవార్డులను అందించారు. అవార్డులు అందుకున్న వారిలో దారావత్ శ్రీనివాస్ నాయక్, భూక్యా రవికుమార్, హాసావత్ మంగారావు, బాణావత్ శ్రీను, జరభల రమేష్ హసావత్ రాంబాబు, భరోత్ రాము, అజ్మీరా నాగేశ్వరావు, వెంకన్న బాబు, మహిళా రైతు బాణావత్ అన్నపూర్ణ ఉన్నారు. అనంతరం జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్, బంజారా సీనియర్ నాయకులు బాదావత్ లక్ష్మణ స్వామి, సంఘ నాయకులు శివ నాయక్, జిల్లా నాయకులు శ్రీనివాస్ నాయక్, సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్ మాట్లాడారు.



రైతులకు అవార్డులు ప్రదానం చేసిన దృశ్యం

విద్యార్థి కుటుంబానికి ఉపాధ్యాయుల ఆర్థిక సాయం

దెందులూరు: చెరువులో పడి మృతి చెందిన సీతంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థి గణేష్ కుటుంబానికి ఆ పాఠశాల ఉపాధ్యాయుడు తోట ఎడ్వర్డ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆర్థికసాయం అందజేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. అందరూ కలిసి రూ. 33 వేలు నగదును శనివారం బాధిత కుటుంబానికి ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు తోట ఎడ్వర్డ్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థి చెరువులో పడి మృతి చెందిన ఘటనను నేటికీ తాము జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. తమ వంతు కర్తవ్యంగా మానవతా దృక్పథంతో ఈ విషయం తెలిసిన వెంటనే ఉపాధ్యాయులందరూ స్పందించి ఆర్థిక సాయాన్ని అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సునీత, రాజ్యలక్ష్మి, విజయకుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

అంతర్వేదిగూడెంలో తాటాకిల్లు దగ్ధం

బుట్టాయగూడెం: అంతర్వేదిగూడెంలో శనివారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో చోడెం రాంపండుకు చెందిన తాటాకిల్లు పూర్తిగా కాలి దగ్ధమైంది. ఆ సమయంలో రాంపండు, అతని భార్య దీపిక పొలం పనులకు వెళ్లగా గ్రామస్తులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఈ ఏడాది 2 ఎకరాలు కౌలుకు తీసుకుని వైట్ బార్లీ పంటను వేశాని, కూలీలకు ఇచ్చేందుకు ఇంట్లో ఉంచిన రూ.30 వేలు, దుస్తులు, సామాగ్రి పూర్తిగా దగ్ధమై కట్టుబట్టలతో మిగిలామని రాంపండు వాపోయాడు. రాంపండు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

అపరాల రైతులను ఆదుకోవాలి



మాదేపల్లిలో అపరాల రైతులతో మాట్లాడుతున్న శ్రీనివాస్ తదితరులు

ఏలూరు రూరల్: అపరాల సాగులో నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన సంఘం నాయకులతో కలిసి ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో రైతులు సాగు చేస్తున్న అపరాల పంట పరిశీలించారు. రైతులు ఎలికే డేవిడ్ రాజు, మారుమూడి సుధాకర్‌ను కలిసి పంట గూర్చి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణా డెల్టా కింద రెండో పంటకు ప్రభుత్వం సాగునీరు అందించలేకపోవడంతో ఏలూరు, దెందులూరు, పెదపాడు మండలంలోని అనేక గ్రామాల రైతులు పెసర, మినుము సాగు చేస్తున్నారని గుర్తు చేశారు. పంట చేతికి వచ్చే సమయంలో పల్లాకు, వైరస్ తెగుళ్లు సోకి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పూత, పిందె దశలో పంటలు ఎండిపోతున్నాయని, పరిస్థితి ఇలాగే కొనసాగితే ఎకరానికి కనీసం 2 లేదా 3 క్వింటాలు సైతం దిగుబడి రాదని రైతులు ఆందోళన చెందుతున్నారని వివరించారు. ప్రభుత్వం నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని కోరారు.

ధర్మాజీగూడెంలో సినిమా షూటింగ్



షూటింగ్‌ను ప్రారంభించిన అంబికా కృష్ణ

లింగపాలెం: పెళ్లిరోజు అనే సినిమా షూటింగ్‌ను శనివారం ధర్మాజీగూడెంలో ప్రారంభించారు. ఈ చిత్రానికి అంబికా కృష్ణ క్లాప్ కొట్టి ప్రారంభించారు. నూతన నటీనటులతో దర్శకుడు వల్లభనేని సురేష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అంబికా కృష్ణ మాట్లాడుతూ నేటితరానికి విడాకుల సమస్యలు ఎక్కువయ్యాయని, కలిసి ఉండాలనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా తీస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో లిడ్క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

దెందులూరు: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి పథకం కూలీ గుండెపోటుకు గురై మృతి చెందింది. దెందులూరు జాతీయ ఉపాధి పథకం ఏపీవో దశరథ రామ్‌జీ, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం ముప్పవరం గ్రామ పంచాయతీ పరిధిలోని కంద్రిక నరసింహపురానికి చెందిన గులిమే జయమ్మ (50) ముప్పవరం పంచాయతీ పరిధిలోని గరిక మొక్కల చెరువులో ఉపాధి కూలి పని చేస్తుండగా శుక్రవారం గుండె నొప్పి రావడంతో అస్వస్థతకు గురై పని ప్రదేశం నుంచి చెరువుగట్టు పైకి వచ్చింది. ఇంతలోనే గుండె నొప్పి అధికమై కప్పకూలి జయమ్మ మృతి చెందింది.